ప్రజాశక్తి

సోమవారం 17 మార్చి 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల







సిపిఎం నేతలకు తమ సమస్యలు వివరిస్తున్న నల్లబర్లీ పొగాకు రైతులు

నల్లబర్లీ పొగాకును కొనేవారేరీ.?

- కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇవ్వలేదు..
- ప్రజాచైతన్య యాత్రలో రైతుల ఆవేదన

ప్రజాశక్తి-పంగులూరు

'లక్షలాది రూపాయలు అప్పులు తీసుకొచ్చి పెట్టుబడులు పెట్టి నల్ల బర్లీ పొగాకు సాగు చేశాం.. ప్రస్తుతం మా ఇళ్లల్లో మండేలు కట్టి ఉంచాం. నల్లబర్లీ పొగాకు సాగు చేయాలని చెప్పిన కంపెనీలు ఇప్పుడు ముఖం చాటేస్తున్నాయి. కొంతమంది బయ్యర్లు రేపు కొంటాం, ఎల్లుండి కొంటాం, పది రోజుల తర్వాత కొంటాం, నెల రోజుల తర్వాత కొంటాం..' అంటూ కాలయాపన చేస్తున్నారు. అసలు కొంటారో.. కొనరో..? కొంటే ఎంతకు కొంటారు.. కొనకపోతే ఏమి చేయాలో అర్థం కాక సతమతమవుతున్నాం' అని పంగులూరు మండలంలోని చందలూరు గ్రామ దళిత కాలనీ కౌలు రైతులు సిపిఎం ప్రచార యాత్ర నాయకుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి, నాయకులు చందలూరు దళిత కాలనీలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత సంవత్సరం కొంత లాభాలు వచ్చాయని, ఈ సంవత్సరం అందరం అధిక కౌలుకు పొలాలు తీసుకొని, ఎక్కువ మొత్తంలో సాగు చేశామని చెప్పారు. బయట రెండు రూపాయలు, మూడు రూపాయలు వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి సాగు చేశామన్నారు. అప్పుల వాళ్లు అడుగుతున్నారని, ఇక్కడ పొగాకు ▶ 2లో

బాలినేనిపై ముప్పేట దాడి..





- జగన్‌పై ఆరోపణలతో వైసిపి నేతలు భగ్గు..
- నిన్నటివరకూ ఆయన వెంట ఉన్న నేతలే ఇప్పుడు విమర్శలు..

పిఠాపురంలో జనసేన ఆవిర్భావ సభలో ఆయన చేసిన ఉద్రేకపూరిత ప్రసంగం ఇప్పుడు రాజకీయవర్గాల్లో కలకలం రేపింది.

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వెంట నిన్నటి వరకూ ఉన్న నేతలే ఇప్పుడు ఆయనపై ముప్పేట దాడి మొదలుపెట్టారు. ఊహించని రీతిలో ఆయనపై విమర్శల దాడి ప్రారంభించారు. ఇంకా చెప్పాలంటే వైసిపిని వీడి జనసేనలో చేరిన మాజీ మంత్రి బాలినేని ఇప్పుడు నిజంగానే ఒంటరి అయిపోయారా? ఆయనకు మద్దతుగా పెద్ద నేతలు ఎవరూ లేరా? అంటే ఎవరూ కనిపించడం లేదు. ఎన్నికల వరకూ ఆయనకూ, తెలుగుదేశం నేతలకూ మధ్య ప్రచ్ఛన్న యుద్ధమే నడిచింది. స్థానిక ఎమ్మెల్యే దామచర్లకూ, ఆయనకూ మధ్య పెద్ద వివాదం ఇప్పటికీ కొనసాగుతోంది. దీంతో ఇప్పుడు ఆయనకు కూటమి నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు కనిపించడం లేదు.

ముఖ్యంగా నిన్నటి వరకూ ఆయన రాజకీయ ప్రస్థానం చేసిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌పై చేసిన ఆరోపణలు వైసిపిలో ఒక్కసారిగా కలకలం రేపాయి. రెండ్రోజులుగా ఆ పార్టీ జిల్లా నేతలు బాలినేనిని టార్గెట్ చేసి విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఆయన రాజకీయ ప్రస్థానం, ఆస్తులు, ఎలా ఎదిగింది? ఆయన వ్యక్తిగత జీవితంపైనా దుమ్మెత్తి పోస్తున్నారు. జగన్ ఆస్తులు ఎలా లాగేసుకున్నారో సమాధానం చెప్పాలంటూ నిలదీస్తున్నారు. ఎవరి వల్ల మీకు టిక్కెట్టు వచ్చిందో వారికే ద్రోహం చేశావంటూ ఆరోపణలు సంధించారు. ఆస్తులపై ఎమ్మెల్యే విచారణ చేయిస్తున్నారని భయపడి పార్టీ మారావంటూ ఆరోపణలు చేశారు. అన్ని నియోజకవర్గాల్లో వివాదాలకు కారణం బాలినేని అంటూ నేతలు ఆరోపించారు. టిక్కెట్లు ఇప్పిస్తామంటూ ఎవరి వద్ద ఎంత లాగావో తెలియదా? అంటూ బాలినేనిపై ఆరోపణలు సంధిస్తున్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఒకడుగు ముందుకు వెళ్లి తమ కుటుంబం ఎన్నికల్లో గెలవకూడదని కుట్రలు చేసింది నువ్వు కాదా? అని బాలినేనిని ఘాటుగా ప్రశ్నించారు. 'జడ్పీని లాగేసుకుంటావా? నీ వెంట ఎవరూ రారు..' అని హెచ్చరించారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కూడా విదేశాల నుంచి వీడియో ద్వారా బాలినేనిపై ధ్వజమెత్తారు. జడ్పీని మార్చడం ఎవరితరమూ కాదన్నారు. 'నీ ఆస్తులు జగన్ లాగేసుకున్నారా? అసలు రాజకీయాల్లోకి రాకముందు నీ ఆస్తులు ఎంత? ఇప్పుడు ఎంత సంపాదించావు?' అని ప్రశ్నించారు. ఇంకా ఒంగోలు ఇన్‌ఛార్జి చుండూరి రవిబాబు, పీడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు ▶ 2లో

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- పరీక్షలు రాయనున్న 29,602 మంది విద్యార్థులు
- 183 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
- నేటి నుంచి 31 వరకు టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో పదోతరగతి పరీక్షలకు సర్వం సిద్ధమైంది. పదో తరగతి పరీక్షలు ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు మొత్తం 29,602 మంది రాయనున్నారు. 183 పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, ఆయా కేంద్రాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. జిల్లాలో 6 సమస్యాత్మక పరీక్షా కేంద్రాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పదో తరగతి పరీక్షలతో పాటు ఓపెన్ స్కూలు సొసైటీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



ఒంగోలు పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డిఇఒ

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖ అధికారులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 183 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 29,602 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయబోతున్నారు. వీరిలో బాలురు 14,994 మంది, బాలికలు 14,608 మంది ఉన్నారు. విద్యార్థులలో 28,176 మంది ఇంగ్లీష్ మీడియం, 1423 మంది తెలుగు మీడియం, మరో ముగ్గురు ఉర్దూ మీడియంలో రాయనున్నారు. గత ఏడాది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేని 100 మంది విద్యార్థులు ఈసారి పరీక్షలకు హాజరవుతున్నారు. పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయి. పరీక్ష కేంద్రంలోకి అనుమతించటానికి 30 నిమిషాల గ్రేస్ పీరియడ్ ఉంటుంది.

9 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు

పదో తరగతి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు 9 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను , పరీక్షల సామగ్రిని సరఫరా చేయడానికి 12 మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. పరీక్షల కోసం ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, కస్టోడియన్స్ నియమించి ఆయా కేంద్రాలకు పరీక్షల సామాగ్రిని తరలించారు.

6 సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని 6 సమస్యాత్మక పరీక్షా కేంద్రాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలోని సిఎస్‌పురం జడ్పీ హైస్కూలు, కొమరోలు జెడ్పీహెచ్‌ఎస్, పిటకాయగుండ్ల హైస్కూలు, వైడిపాడు జడ్పీహెచ్‌ఎస్, రాచర్ల జడ్పీహెచ్‌ఎస్, యాచవరం జడ్పీ హైస్కూల్స్ వద్ద 144 సెక్షన్ అమలు చేయటంతో పాటు సిసి కెమెరాలతో పర్యవేక్షించనున్నారు.

ఓపెన్ స్కూలు పరీక్షలకు సిద్ధం

ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షల కోసం 1,564 మంది విద్యార్థులు హాజరు కానుండగా, వీరి కోసం 23 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. . ఓపెన్ స్కూల్ విద్యార్థులకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఓపెన్ స్కూల్ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాసే కేంద్రంలోనే కొన్ని గదులను ▶ 2లో



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా

మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు

- బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం కృషి
- రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆత్మ త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన కషి మరువలేనిదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. ఆదివారం పొట్టి శ్రీరాములు 125వ జయంతిని పురస్కరించుకుని ఒంగోలు నగరం, సివిఎన్ రీడింగ్ రూమ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి మంత్రి, కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, సంతనూతలపాడు శాసన సభ్యులు బిఎన్ విజయకుమార్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకష్ణ, మాల కార్పొరేషన్ ఛైర్మన్ పి.విజయ్ కుమార్‌తో కలసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధునిగా పొట్టిశ్రీరాములు పోరాట పటిమ స్ఫూర్తిదాయకమన్నారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ తెలుగు ప్రజల కోసం, దేశం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం ▶ 2లో

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పదో తరగతి విద్యార్థులకు దామచర్ల సత్య శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కొండపి

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. ఆదివారం సత్య ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులందరూ సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొని, ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు.

నల్లబర్లీ పొగాకును కొనేవారేరీ.?

(మొదటిపేజీ తరువాయి)

అమ్మక ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నామని తెలిపారు. అంతా కౌలు రైతులు అయినా, ఒకరికి కూడా అధికారులు కౌలు గుర్తింపు కార్డు ఇవ్వలేదని చెప్పారు. రైతులను పాస్ బుక్ జిరాక్స్ అడిగితే వాళ్లు ఇవ్వలేదని చెప్పారు. దీని వల్ల పంట రుణాలు రాకపోగా, నష్టపరిహారాలు కూడా అందడం లేదని చెప్పారు. ప్రభుత్వ రాయితీలు కూడా భూ యజమానులకు అందుతున్నాయని నాయకులకు తెలిపారు. కుటుంబాల్లో ఖర్చులు ఎక్కువైపోయాయన్నారు. ఆరోగ్యశ్రీ పథకం అమలు కాకపోవటం వల్ల ఏదైనా ప్రమాదం జరిగిన, ఆరోగ్యాలు బాగా లేకపోయినా లక్షల రూపాయలు అప్పులు తెచ్చి ఆసుపత్రిలో పోయాల్సి వస్తుందని తెలిపారు. వాతావరణం అనుకూలించక, సకాలంలో పొగాకు కొనుగోలు చేయకపోవడం వలన ఈ సంవత్సరం తామంతా నష్టపోవాల్సి వస్తుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కౌలు రైతులు కోరారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ బర్లీ పొగాకును కూడా పొగాకు బోర్డు పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బర్లీ పొగాకు రైతులకు ఒక నిర్దిష్టమైన హామీలు లేకపోవడం వల్ల వారు ప్రైవేటు కంపెనీలపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. ప్రైవేట్ కంపెనీలు వాళ్ళ ఇష్టానుసారంగా ధరలు దిగదార్చడం, ఆలస్యంగా కొనడం వల్ల రైతులు నష్టపోతున్నారని చెప్పారు. తక్షణమే పొగాకు బోర్డు జోక్యం చేసుకొని నల్ల బార్లీ పొగాకును కూడా కొనుగోలు జరిగేటట్లు చూడాలని చెప్పారు. ప్రభుత్వం వైపు నుండి కౌలు రైతులకు ఎలాంటి సహకారం లేదని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట రుణాలు కౌలు రైతులకే ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేయాలని, నష్ట పరిహారాలు కూడా కౌలు రైతులకు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. తల్లికి వందనం, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అమలు చేయకపోవడం వల్ల పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఆ పథకాలను అమలు చేయాలని కోరారు. సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ కౌలు రైతులంతా ఐక్యంగా ఉండాలని, ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలమని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు రాయిని వినోద్ బాబు, పార్టీ మండల కార్యదర్శి తలపనేని రామారావు, నాయకులు ప్రభాకర్, తానికొండ సుధాకర్, కౌలు రైతులు పోతారావు, రాఘవులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి 'పొట్టి శ్రీరాములు'

(మొదటిపేజీ తరువాయి)

మరువలేనిదన్నారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యంతో పాటు దళితులకు ఆలయ ప్రవేశం కోసం నిరాహార దీక్ష చేసిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని గుర్తు చేశారు. సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయకుమార్ మాట్లాడుతూ దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు త్యాగమే నాంది అని తెలిపారు. మాల కార్పొరేషన్ ఛైర్మన్ పి. విజయ్ కుమార్ మాట్లాడుతూ పోరాట పటిమకు, కార్యదీక్షకు ప్రతిబింబముగా నిలిచిన పొట్టి శ్రీరాములును యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారి అంజల, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, బి.సి. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఒంగోలు ఆర్టీవో లక్ష్మీ ప్రసన్న, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఒంగోలు తహశీల్దార్ వాసు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, వర్తక సంఘాల నేతలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-టంగుటూరు

చెన్నైలోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ముఖ్య అతిథిగా హాజరై పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెన్నైలోని మైలాపూర్, రాయపేట్ హై రోడ్డులోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో కమిటీ మెంబర్ పూర్ణ చంద్రరావు, అసోసియేషన్ అధ్యక్షులు అనిల్ కుమార్ రెడ్డి, సెక్రెటరీ, ట్రెజరర్ వి.కృష్ణారావుల అధ్వర్యంలో తమిళనాడులో తెలుగు భాషకు కృషి చేసిన అధ్యాపకులకు దామచర్ల సత్య సన్మానం చేసి ధ్రువీకరణపత్రాలు అందజేశారు.

శింగరాయకొండ: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శింగరాయకొండ రైల్వేస్టేషన్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘనంగా ఆదివారం నివాళులు అర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ శింగరాయకొండ న్యూ కార్యదర్శి జమిలి శివసుబ్రమణ్యం, వాసవి వనిత క్లబ్ అధ్యక్షులు కొత్తమాసు ఉదయలక్ష్మి, కోశాధికారి ఇమ్మడి సురేఖ, జిల్లా ఇంచార్జ్ పబ్బిశెట్టి శ్రీనివాసరావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అచ్యుత చెంచు సుబ్బారావు, కొలపర్తి సుబ్బారావు, గోనుగుంట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం యర్రగొండపాలెం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజుల పాటు కఠోర దీక్ష చేసి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. పొట్టి శ్రీరాములు ప్రాణాలు విడిచే వరకు అప్పుడు ఉన్న తెలుగు ప్రజలు కూడా పెద్ద ఆందోళన చేయలేదన్నారు. ఆయన చనిపోయిన తర్వాతే ప్రజల్లో ఆగ్రహం పెలుబికిందని చెప్పారు. అందరూ బయటకు వచ్చారన్నారు. వారి ఉద్యమాన్ని చూసి పండిట్ నెహ్రూ వంటి వారు పార్లమెంట్లో తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ప్రకటించారని వివరించారు. 1953 మార్చిలో ఆంధ్రరాష్ట్రం ఏర్పడగా, అక్టోబర్ 1వ తేదీన స్వయం పాలన వచ్చిందన్నారు. తెలంగాణలో కలిసిన తర్వాత కొన్నేళ్ల క్రితం మళ్లీ రాష్ట్రం విడిపోయిందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, జిబివుల్లా, తూమాటి రాంబాబు, సత్తిరెడ్డి, సుందర్, సూరె వెంకట ప్రసాద్, శ్రీను, కోటిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రాములు నాయక్, గురిజేపల్లి వలి తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు: టీడీపీ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు తెలుగు రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం ప్రాణాలను త్యజించిన అమరజీవి శ్రీరాములు అని అన్నారు.



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న దామచర్ల సత్య



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల

'బాలినేని'పై ముప్పేట దాడి..

(మొదటిపేజీ తరువాయి)

అంజిరెడ్డి తదితరులు మాట్లాడుతూ బాలినేనిపై నేరుగా ధ్వజమెత్తారు. ఆయన బయటకు పోవడం వల్ల పార్టీకి నష్టం ఏమీ లేకపోగా ఇప్పుడు ప్రశాంతంగా ఉందని వ్యాఖ్యానించారు. వీళ్లంతా బాలినేని వైసిపిలో ఉన్నప్పటి వరకూ అందరూ కలిసే ఉన్నారు. లోపలెన్ని ఉన్నా పైకి ఐక్యంగానే నడిచారు. బాలినేని నాయకత్వంలోనే పనిచేశారు. అయితే వీరి ఆరోపణలతో బాలినేని రాజకీయ భవితవ్యంపైనే పెద్ద చర్చ సాగుతోంది. పార్టీని వీడిపోవడం వల్ల ఆయన రాజకీయ ప్రతిష్ట దిగజారిందనే విశ్లేషణలూ ఉన్నాయి. అయితే జగన్ తనను అన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టడం వల్లే పార్టీని వీడానంటూ ఆవేశంగా పలుసార్లు చెప్పారు. పిఠాపురంలో ఆయన ప్రసంగం దుమారం రేపింది. జగన్‌పై లేనిపోని ఆరోపణలు చేశారంటూ వైసిపి నేతలు భగ్గుమంటున్నారు. సంక్షోభాల సమయాల్లోనే అన్ని బయటకు వస్తాయన్నదీ నిజం. ఇప్పటి వరకూ అందరూ ఒకేపార్టీలో ఉన్నారు. అంతర్గత కుమ్ములాటలు, కుట్రలు, ఒకరినొకరు ఓడించుకునే చర్యలు, ఆధిపత్య పోరు వంటివి ఇలాంటి సందర్భాల్లోనే అనివార్యంగా బయటపడతాయి. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే సామెతను గుర్తు చేస్తుంటాయి. అయితే కొందరు నేతలు పార్టీలు మారినప్పుడు వారిలో ఆవేశం బయటకు వస్తుంది. తనకు జరిగిన అన్యాయాలను చెప్పుకుంటారు సహజంగా.. అయితే వాటిని వేదికలపై వెళ్లగక్కే సమయాల్లో తమ తప్పిదాలను మరిచిపోతారు. అవే ఇప్పుడు ప్రత్యర్థులకు ఆయుధాలుగా మారుతున్నాయి. ఇప్పుడు పార్టీలో ఉన్నప్పుడు బాలినేని చేసిన తప్పిదాలను వైసిపి నేతలు బయటపెట్టారు. అవి ఎంతవరకు నిజం? ఎంతవరకు నమ్మశక్యం.? అనే విషయాన్ని పక్కనబెడితే అంతర్గత వ్యవహారాలన్నీ బయటకు వచ్చేశాయి. బూచేపల్లి కుటుంబానికి, బాలినేనికి మధ్య కొంతకాలంగా ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోంది. బూచేపల్లి నేరుగా పార్టీ అధినేత వైఎస్.జగన్‌కు విధేయుడుగా ఉన్నారు. వాస్తవంగా బాలినేని, బూచేపల్లి మధ్య గ్యాప్ ఉంది. అయితే ఇప్పుడు అన్నీ బయటకు వచ్చేశాయి. నిన్నటివరకూ మౌనంగా భరించారు. ఇప్పుడు ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ నేరుగా బాలినేనిపై ధ్వజమెత్తారు. 2004 నుంచి 2024 ఎన్నికల వరకూ తమ కుటుంబాన్ని ఓడించేందుకు కుట్రలు చేశారంటూ బాలినేనిపై ఆరోపణలు సంధించారు. వైసిపి నేతల దాడి చూస్తుంటే కొన్ని అంశాలు విస్తుపోయేలా ఉన్నాయి. కేవలం పార్టీ ఫిరాయించినా ఇప్పటివరకూ వైసిపి వర్గాలు ఆచీతూచీ అడుగులు వేశాయి. అటు బాలినేనితోనూ కొందరు టచ్‌లో ఉన్నారనే చర్చ ఉంది. కొందరు ఊగిసలాట ధోరణిలో ఉన్నారు. ఇప్పుడు బాలినేనికి, వైసిపికి మధ్య క్లియర్‌గా విభజన రేఖ ఏర్పడింది. అధిష్టానం ఇచ్చిన ఆదేశాలతో చెలగేరిపోయారు. సీనియర్ నేతగా ఉన్న బాలినేని వంటి నేతలకు కూడా ఇలాంటి పరిస్థితి ఎందుకు వచ్చింది? ఆయన వెంట ఉన్న నేతలే ఆయన్ను ఎందుకు టార్గెట్ చేశారంటే కేవలం ఇప్పటి వరకూ ఎదిగిన పార్టీని వదలడమే కాకుండా ఆ పార్టీ అధినేతపైనా, చేయూత ఇచ్చిన వారిపైనా ఆరోపణలు చేయడమేనని వైసిపి నేతలు అంటున్నారు. ఏదేమైనా జనసేనలో చేరిన ఆయన భవితవ్యం ఎలా ఉంటుందో చూడాలి. కూటమి నుంచి జిల్లాలో ఎలాంటి పరిస్థితిని ఎదుర్కొంటారో వేచిచూద్దాం.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించారు.

మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాం

- డిఇఒ ఏ.కిరణ్ కుమార్

పదో తరగతి పరీక్షా కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాం. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వీటిని నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం. పరీక్షలకు వెళ్లే విద్యార్థుల సౌకర్యం కోసం ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచుతున్నాం. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఎలాంటి పుకార్లను వ్యాప్తి చేసినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

సమస్యలతో సతమతమవుతున్నాం

సిపిఎం ప్రజా చైతన్య యాత్ర బృందం ఎదుట విఠలేశ్వర్ నగర్ వాసుల ఆవేదన

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు సిపిఎం ప్రజా చైతన్య యాత్ర భట్టిప్రోలు పంచాయతీలోని ఎస్టీ కాలనీ, విట్టలేశ్వర్ నగర్‌లో ఆదివారం కొనసాగింది. ఈ కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సిపిఎం బృందానికి తెలియజేశారు. 20 సంవత్సరాల క్రితం ఇళ్ల స్థలాలు ఇచ్చిన విఠలేశ్వర్ నగర్‌లో అంతర్గత రోడ్లు, మురుగునీరు పోయేందుకు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలం వస్తే నీళ్లు ఇంటి ముందు నిలబడటం వలన బయటకు వెళ్లే పరిస్థితి లేదని లబ్ధిదారులు బృందం ఎదుట వాపోయారు. ప్రజలందరికీ సరిపోను పంచాయతీ మంచినీటి కుళాయిలు లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. విఠలేశ్వర్ నగర్ ప్రాంతాన్ని ఒక వార్డుగా గుర్తించాలని అక్కడ ప్రజలు బృందాన్ని కోరారు. వీటిపై అధికారులు దృష్టి పెట్టి పనిచేస్తే చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కారం చేయొచ్చునని, పేదల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వీడి పరిష్కారం కోసం చొరవ చూపాలని పార్టీ మండల కార్యదర్శి జి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం సీపీఎం పార్టీగా కృషి చేస్తామని బృందం ప్రజలకు భరోసానిచ్చింది. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మురుగుడు సత్యనారాయణ, గోళ్ళ నాగరాజు, అహరోను, పి. మనోజ్ కుమార్ పాల్గొన్నారు.



భట్టిప్రోలు కాలనీల్లో సిపిఎం బృందానికి సమస్యలు వివరిస్తున్న ప్రజలు

సంతనూతలపాడు: మురుగు కాలువల్లో సంవత్సరానికి ఒక్కసారైనా కూడిక తీయడం లేదని ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం మంగమూరు ఎస్సీ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు .సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్ర బృందం మండలంలోని మంగమూరు ఎస్సీ కాలనీలో ఆదివారం పర్యటించింది. ఈ సందర్భంగా కాలనీవాసులను బృందం నాయకులు కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో కొన్నిచోట్ల మాత్రమే మురుగు కాలువలు ఏర్పాటు చేశారని, మిగతా చోట్ల అసలు కాలువలే లేవని వారు తెలిపారు. మురుగు కాలువలు ఉన్నచోటైనా సంవత్సరానికి ఒక్కసారైనా మురుగు తీయక దోమలు వృద్ధి చెందుతున్నాయని, వాటి వల్ల రోగాలు బారిన పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు తీయకపోవడంతో మురుగు నీరు రోడ్ల మీదకు వస్తోందని వారు తెలిపారు. కరెంట్ 200 యూనిట్లు లోపు కాల్చుకున్నా బిల్లులు కట్టాలని బిల్లులు ఇస్తున్నట్లు వారు తెలిపారు. ఎస్సీలకు 200 లోపు యూనిట్లు వాడినవారికి ఉచిత విద్యుత్ అని గత ప్రభుత్వంలో బిల్లులు చెల్లించలేదని వారు తెలిపారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు కట్టాలని చెప్తున్నారని వారు తెలిపారు. ప్రజా చైతన్య యాత్ర బృందంలో సిపిఎం నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, అబ్బూరి వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్, షేక్ నాగూర్, షేక్ చిన్న మస్తాన్, బంకా పద్మ, అబ్బూరి బసవమ్మ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పైకి వచ్చిన మురుగు నీటిని పరిశీలిస్తున్న ప్రజా చైతన్య యాత్ర బృందం

ముండ్లమూరు: ప్రజా చైతన్య యాత్ర బృందం శంకరాపురం గ్రామంలోని ఎన్ఎస్పి కాలువను పరిశీలించింది. ఒకప్పుడు నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా మోదేపల్లి వరకు నీరు వచ్చి పంటలతో కళకళలాడే ప్రాంతం ఈరోజు సాగరు నీరురాక వర్షాధార పంటలపై ఆధారపడాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా కాలువలు రిపేర్ పేరుతో కోట్లది రూపాయలు ఖర్చు పెడుతున్నా సాగర్ చివరి భూముల దాకా నీరందే పరిస్థితులు కాన రావట్లేదని అన్నారు. గతంలో జీవనది గుండ్లకమ్మ నీటిని నాయుడుపాలెం వద్ద ఎన్ఎస్పి కాలువలోనికి కలిపి సాగర్ చివరి భూముల వరకు నీరు ఇవ్వచ్చని సర్వే చేశారని అది కాగితాలకే పరిమితమైందని మరల సర్వే చేసి ప్రభుత్వం ద్వారా నిధులు అందేలా చేసి ప్రభుత్వ అధికారులు సాగర్ చివరి భూములకు నీరు అందేలా చూడాలని సిపిఎం ముండ్లమూరు మండల కమిటీ డిమాండ్ చేసింది.



ముండ్లమూరు మండలంలో ప్రజా చైతన్య యాత్ర దృశ్యం



ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితురాలు

మత్తు పదార్థాలు విక్రయిస్తున్న మహిళ అరెస్టు

ప్రజాశక్తి బాపట్ల

యువతను మత్తుకు బానిసలను చేసే విధంగా టాబ్లెట్ల రూపంలో రహస్యంగా మత్తు పదార్థాలను విక్రయిస్తున్న ఓ మహిళను ఎక్సైజ్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. బాపట్ల ఎక్సైజ్ సీఐ పి. గీతిక తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల మండలం మండలం వెదుళ్ళపల్లి లో ఓ మహిళ తన గృహంలో వైద్యులు నొప్పు లకు వాడే మందు బిళ్ళలను యువతకు అధిక మొత్తంలో విక్రయిస్తూ పట్టుబడింది అన్నారు. ఈ మందులు మత్తు కలిగించేందుకు మాత్రల రూపంలో ఇంజక్షన్ల రూపంలో యువతకు ప్రధానంగా విద్యార్థులకు మత్తులో ముంచేత్తే ఈ మాత్రలను రహస్యంగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు అన్నారు. వీటిని విక్రయిస్తున్న ఓ మహిళను అదుపులోకి తీసుకుని ఆమె విక్రయిస్తున్న టాబ్లెట్లను స్వాధీనం చేసుకుని జిల్లా డ్రగ్ ఇన్ స్పెక్టర్ కు అప్పగించినట్లు సీఐ గీతిక తెలిపారు. నొప్పులకు వైద్యులు వినియోగించే ఈ మాత్రలు అధిక మోతాదులో ఉపయోగిస్తే మెదడుపై దాని ప్రభావం చూపుతూ శరీరంపై మత్తు ప్రభావం చూపుతోందని ఆమె తెలిపారు. అది గాక మెడికల్ షాపుల్లో విక్రయించే ఈ మాత్రలు 1600 వరకు పెద్ద మొత్తంలో ఆ మహిళ దగ్గర ఉన్నట్లు గుర్తించామన్నారు. అవి మొత్తం స్వాధీనం చేసుకుని డ్రగ్ ఇన్స్ స్పెక్టర్‌కు అప్పగించామని ఆమె వివరించారు.

కోడిపందేల స్థావరంపై దాడి.. ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-చెరుకుపల్లి

కోడి పందాలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు చెరుకుపల్లి ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని పొన్నపల్లి గ్రామంలో ఆదివారం కోడి పందాలు వేస్తున్నట్లుగా ముందస్తు సమాచారం రావడంతో వెంటనే దాడి నిర్వహించిన చెరుకుపల్లి ఎస్సై అనిల్ కుమార్ గ్రామ సమీపంలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రెండు కోళ్ళ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాలలో ఎవరైనా కోడిపందాలు, పేకాట, జూదము ఆడుతున్నట్లుగా తెలిస్తే సమాచారం అందించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శోభారాణి

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

ఎంపీడీవో శోభారాణి

ప్రజాశక్తి-రేపల్లె

వేసవి దష్ట్యా రేపల్లె మండలంలో త్రాగునీటి సమస్య లేకుండా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని రేపల్లె ఎంపీడీవో ఎం శోభారాణి అన్నారు ఆదివారం రేపల్లె మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీపీ పెనుమాల సుశీల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహించాలని ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టే చర్యలు చేపట్టాలన్నారు. 2024 25 సంవత్సరానికి పంచాయతీల్లో ఈ నెలాఖరు కల్లా అన్ని రకాల టాక్సు నూటికి నూరు శాతం వసూలు చేయాలని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా ఆయా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అభివద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో సూచించారు ప్రభుత్వ శాఖల వారీగా ఆయా శాఖల అధికారులు మండలంలో గత ఏడాది ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి చేపట్టిన అభివద్ధి పనులు గురించి సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ పెనుమాల సుశీల ఉపాధ్యక్షురాలు రావు లక్ష్మీ నెహ్రూ కుమారి, పీత వెంకటేశ్వరరావు ఈవో పి ఆర్ డి ప్రసాద్ మండల పరిషత్ పరిపాలన అధికారి రమేష్ పంచాయతీరాజ్ ఇరిగేషన్ డ్రైనేజీ విద్యాశాఖ హౌసింగ్ ఎన్ ఆర్ జి ఎస్ పిఒ వెలుగు ప్రాజెక్ట్ ఏవో.. రెవిన్యూ శాఖ.. విద్యుత్ శాఖ అధికారులు పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు ఎంపిటీసీలు జడ్పీటీసీలు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

ప్రజాశక్తి సంతనూతలపాడు

స్థానిక వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్బుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా పొట్టి శ్రీరాములు 124వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంతనూతలపాడులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం, బస్టాండ్ సెంటర్ వద్ద గల పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాదరావు, ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఉపాధ్యక్షులు ఎస్ సత్యనారాయణ, వాసవి మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతి తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



పరీక్ష కిట్లు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ అంకారావు

'పది' విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

ప్రజాశక్తి సంతనూతలపాడు

స్థానిక అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో హాస్టలు, ఎస్సీ వర్గాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లను సంతనూతలపాడు మాజీ సర్పంచ్, టిడిపి నాయకులు రంపతోటి అంకారావు స్వచ్ఛందంగా ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక ఎస్సీ హాస్టల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు, స్థానిక అంబేద్కర్ నగర్, క్రిస్టియన్ పాలెంలలో గల 110 మంది 10 వ తరగతి విద్యార్థులకు మాజీ సర్పంచ్ అంకారావు ఈ సందర్భంగా పరీక్ష కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షులు మార్పుడి రామాంజనేయులు, సంఘ నాయకులు డి ప్రకాశం, బి వేణు, బి అనిల్, పి లక్ష్మీనారాయణ, సుదర్శి చక్ర తేజ, మార్పుడి వెంకటేష్, మార్పుడి సుధాకర్, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



చిరిగిపోయిన ఫ్లెక్సీ

అధికార పార్టీ నేతల ఫ్లెక్సీ చించివేత

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి మండలం మణికేశ్వరం గ్రామం ఎస్సీ కాలనీలో తెలుగుదేశం పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. మంత్రి గొట్టిపాటి రవికుమార్, నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షుడు షేక్ కరిముల్లా మరియు కొంతమంది కార్యకర్తల ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలను ఉద్దేశపూర్వకంగా చింపేశారేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సినీ సాహిత్య నిఘంటువు 'సముద్రాల రాఘవాచార్య'

ప్రజాశక్తి-బాపట్ల



సముద్రాల చిత్రపటానికి నివాళి

చిత్ర సీమలో చలనచిత్ర సంభాషణలకు సముద్రాల రాఘవాచార్య(సీనియర్) ఒక నిఘంటువు అని సాహితీ భారతీయ అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ అన్నారు. ఆదివారం సముద్రాల రాఘవాచార్య 57వ వర్ధంతి సందర్భంగా సాహితీ భారతీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వర్మ మాట్లాడుతూ సముద్రాల దాదాపు 100 చిత్రాలకు సమాజాన్ని చైతన్య పరిచే రీతిలో సంభాషణలు రచించారన్నారు. 1000 కి పైచిలుకు సందేశాత్మక పాటలు రచించి తెలుగు సినీ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారన్నారు. సాహితి భారతి ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రి రావు మాట్లాడుతూ సముద్రాల కలం నుండి జాలువారిన సినీ గీతాల్లో ప్రధానమైనవి హిమగిరి సొగసులు, హాయి హాయిగా ఆమని సాగే ,జీవితమే సఫలము, కుడిఎడమైతే పొరపాటు లేదోయ్,ప్రియురాల సిగ్గేలనే,ఎవరి కోసం ఈ మందహాసం, రారోయి మా ఇంటికి, నీలకంధరా, దేవ దేవ ధవళాచల మందిర, రామ కథను వినరయ్యా, వంటి నవరస భరిత గీతాలు రచించి తెలుగు ప్రేక్షకులను అలరించారన్నారు . కార్యక్రమంలో ఆదం షఫీ, ఎన్. కష్ణ , ఎం. జాకబ్ , బొడ్డుపల్లి శ్రీరామ చంద్రమూర్తి , కస్తూరి శ్రీనివాసరావు, డి శామ్యూల్, కాళిదాసు పాల్గొన్నారు.

సిబిజడ్ చర్చి బెల్ టవర్ ప్రారంభం

ప్రజాశక్తి-బాపట్ల



సిబిజెడ్ చర్చ్ బెల్ టవర్

పట్టణంలో సిబిజెడ్ చర్చి ఆవరణలో నూతనంగా నిర్మించిన బెల్ టవర్‌ను ప్రముఖ సువార్తీకులు తాడికొండ శామ్యూల్ జాన్సన్ ఆదివారం ప్రారంభించారు. రూ.42 లక్షల వ్యయంతో నిర్మించిన బెల్ టవర్ ప్రారంభోత్సవ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ టవర్ నుంచి వచ్చే ధ్వని శ్రావ్యగా ఉంటుందని శామ్యూల్ జాన్సన్ తెలిపారు. విదేశాల్లో ఉండే బెల్ టవర్స్‌కు ధీటుగా సిబిజెడ్ చర్చి బెల్ టవర్‌ను శామ్యూల్ జాన్సన్ ఆర్థిక సహకారంతో నిర్మించినట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా సిబిజెడ్ పునర్నిర్మాణానికి మూడు కోట్లు ఆర్థిక సహాయం ఆయన అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, క్రైస్తవ మత బోధకులు పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రితో విద్యార్థులు

'పది' విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-పర్చూరు

దాతల సహకారంతో పదో తరగతి చదువుతున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం చీరాల (కేజీబీవీ), ఉప్పుటూరు జడ్పీ హైస్కూల్, పర్చూరు ఎస్సీ బాలికల హాస్టల్, ఎస్టి బాలుర హాస్టల్ విద్యార్థులు దాదాపు 200 మందికి పైగా గ్లోరియస్ అగాపే చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎగ్జామ్ కిట్స్, ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్స్, ఎరేజర్లు, చాక్మార్లు సొసైటీ ఫౌండర్ మాచవరపు రవి కుమార్ ఆదివారం అందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విద్యకు నేటి సమాజంలో ఎంతో ప్రాముఖ్యత ప్రాధాన్యత ఉన్నదని అన్నారు. అటువంటి విద్య పట్ల విద్యార్థులు కృషి, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించి మీ తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు ఊరబడి శంకర్ తేజ్ కుమార్, మిక్కిలి రాజేష్ కుమార్, బిల్లా అశోక్ కుమార్, కేజీబీవీ ఎస్ఓ సుజాత, ఇంగ్లీష్ టీచర్ శారద, పర్చూరు ఎస్సి బాలికల హాస్టల్ వార్డెన్ అనంతలక్ష్మి, పర్చూరు ఎస్టి బాలుర హాస్టల్ వార్డెన్, కె శ్రీను నాయక్, ఉపాధ్యాయులు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి-చీరాల

ప్రాణ త్యాగంతో తెలుగు జాతికి గుర్తింపు తెచ్చిన అమరజీవి పొట్టి శ్రీరాములను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని తెలుగుదేశం కూటమి నాయకులు అన్నారు. చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ఆదేశాల మేరకు అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం కామధేను కాంప్లెక్స్ దగ్గర అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అహింసా పద్ధతిలో ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన మహనీయులు పొట్టి శ్రీరాములని అన్నారు. ఆయన పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని 50 రోజులకు పైగానే ఆమరణ నిరాహార దీక్ష చేసిన గొప్ప వ్యక్తిగా అభివర్ణించారు. ప్రత్యేకంగా ఆంధ్ర రాష్ట్రం కావాలని చేపట్టిన పోరాటంలో తన ప్రాణాలను పణంగా పెట్టారన్నారు. మానవులకు సాధ్యం కాదేమో అనిపించేలా పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి పెట్టారని వివరించారు. రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో ఏర్పడిన ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇప్పుడిప్పుడే అభివృద్ధి బాటలోకి వస్తోందన్నారు. తెలుగు రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాముల కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీరాల తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, బాపట్ల బీసీ సెల్ అధ్యక్షులు కౌతరపు జనార్ధన్, ఎంఆర్ఎఫ్ రమేష్, ఉల్లిపాయల సుబ్బయ్య, బిజెపి నాయకులు చంద్ర, జనసేన నాయకులు గూడూరు శివరాం ప్రసాద్, కొండు రత్నబాబు, తలబ్రోలు నాగేశ్వర రావు, మున్సిపల్ కౌన్సిలర్లు, తెలుగుదేశం, జనసేన బిజెపి నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

సంతమాగులూరు: సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో ఆదివారం గ్రంథ పాలకులు బాదం విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన ప్రాణత్యాగాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అద్దంకి: అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి సందర్భంగా పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లోని పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు ఊటుకూరి రాము, కోటేశ్వరరావు, సెక్రటరీ అరవపల్లి హనుమంతరావు, బాపట్ల జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగ అధ్యక్షులు గునుపూడి రఘురాం గుప్తా, 12వ వార్డు కౌన్సిలర్ అత్తులూరి రమేష్‌బాబు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కూరపాటి రామకోటేశ్వరరావు, ట్రెజరర్ చామర్తి శ్రీనివాసరావు (బుల్లెట్) ధన్వంతరి దత్త పాదుకా క్షేత్రం అధ్యక్షులు నాగసూరి హనుమత్ ప్రసాద్, ఉడతా సురేష్, అయితా శివ నాగరాజు, కురిచేటి ప్రసాద్ (స్వీట్ షాప్), పొట్టి వెంకట శివ, చిన్ని ప్రసాద్, కురిచేటి శంకర్రావు, కొల్లిపర్ల రామారావు (హిందీ మాస్టర్), మారం మారుతి, అత్తులూరి రవికుమార్ , వాసవి వనిత క్లబ్ కమిటీ సభ్యులు తదితర ఆర్యవైశ్య ప్రముఖులు నాయకులు పాల్గొన్నారు.



చీరాలలో పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పిస్తున్న టిడిపి నాయకులు

రోటరీ ఆధ్వర్యంలో..

ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు ప్రాణ త్యాగం చేసిన అమరజీవి, శ్రీపొట్టి శ్రీరాములు 125వ జయంతి రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మెయిన్ రోడ్‌లోని పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, రోటరీ సభ్యులు పూలమాల వేసి నివాళి అర్పించారు. తదుపరి అధ్యక్షులు వీరయ్య మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు గాంధీజీ చూపిన సత్యాగ్రహ మార్గాన్ని ఎంచుకొని 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేసి ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రాన్ని శ్రీరాములు సాధించారని పేర్కొన్నారు. లేవి ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రోటరీ ట్రెజరర్ మలాది శ్రీనివాస రావు, ఊటుకూరి రామకోటేశ్వరావు, సంకా సుబ్రహ్మణ్యం (బాబు), తమ్మన శ్రీనివాసరావు, బాచిన పూర్ణచంద్రరావు, గుళ్లపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



అమరజీవికి నివాళి అర్పిస్తున్న బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

బాపట్ల: బాపట్ల ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి ఇన్‌ఛార్జి అసోసియేట్ డీన్ జి రవిబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మహాత్ముల ఆశయాలను నేటి విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. ఆయన అడుగుజాడల్లో తెలుగు ప్రజలు నడవాలని కోరారు. కార్యక్రమంలో బి శ్రీనివాసులురెడ్డి, కెవిఎస్ రామిరెడ్డి, ఎన్ అశోక్‌కుమార్, పిడి వెంకటేశ్వర్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

భట్టిప్రోలు: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వెల్లటూరు వాసవీ క్లబ్, ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద పొట్టి శ్రీరాములు, జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేసవికాలం సమీపిస్తుండటంతో వెల్లటూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామంలో మంచినీటి కుండలను పంపిణీ చేశారు. అలాగే భట్టిప్రోలు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మండల పరిషత్తు కార్యాలయాల్లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి, సాయిబాబా దేవస్థానం వద్ద గల విగ్రహానికి, టిఎం రావు ఉన్నత పాఠశాలలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెల్లటూరు వాసవీ క్లబ్ అధ్యక్షులు నాగళ్ల ఆంజనేయులు, భట్టిప్రోలు వాసవీ క్లబ్ అధ్యక్షులు బోర్లే వెంకట చంద్రశేఖర్, కొత్త నాగవెంకటతేజ, వి శ్రీనివాసరావు, తూనుగుంట్ల సాయిబాబా, బోర్లే రాంప్రసాద్, చందులూరి రామకోటేశ్వర రావు, ఉమామహేశ్వరరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, అచ్యుత నాగ రమేష్, కుబేర వనిత సభ్యులు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



సంతమాగులూరు గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములుకు నివాళి



భట్టిప్రోలులో పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు



అద్దంకిలో అమరజీవికి రోటరీ సభ్యుల నివాళి

రేపు చెరుకుపల్లిలో జాబ్ మేళా

ప్రజాశక్తి-చెరుకుపల్లి



అధికారి పి ప్రణయ్

ఈ నెల 18వ తేదీ మంగళవారం చెరుకుపల్లిలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి మరియు చెరుకుపల్లి మండల ప్రత్యేక అధికారి అయిన పి ప్రణయ్ తెలిపారు. స్థానిక చెరుకుపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించే జాబ్ మేళా కార్యక్రమానికి డాక్టస్ బిజినెస్ సొల్యూషన్స్, డైకిన్ ఎయిర్ కండిషన్స్ కంపెనీల వారు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయము మరియు చెరుకుపల్లి మండల పరిషత్ కార్యాలయం వారిచే నిర్వహించే ఈ జాబ్ మేళాలో వందకు పైగా ఖాళీలు ఉన్నాయని అర్హతను బట్టి 12000 రూపాయలు నుండి 18 వేల రూపాయల వరకు వేతనం అందజేస్తారని తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ డిగ్రీ, డిప్లొమా, విభాగాల వరకు చదువుకున్న, 18-30 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు వారి యొక్క బయోడేటా లేదా రెస్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్,ఆధార్ నకలు మరియు పాస్ పోర్ట్ ఫోటో తో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 9032384374 ఫోన్ నెంబర్ల సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నంబర్: 9988853335 ద్వారా సంప్రదించవచ్చునని తెలిపారు.

సిపిఎం సానుభూతిపరుడు నాగ వీర బసవయ్య మృతి

ప్రజాశక్తి-భట్టిప్రోలు



నివాళులర్పిస్తున్న రమాదేవి (ఇన్‌సెట్‌లో) నాగ వీర బసవయ్య (ఫైల్)

మండలంలోని పెసర్లంక గ్రామానికి చెందిన సిపిఎం మద్దతుదారుడు ముమ్మనేని నాగ వీర బసవయ్య (86) ఆదివారం ఆయన స్వగృహంలో అనారోగ్యంతో మరణించారు. ఆయన గతంలో 1962 ప్రాంతంలో సర్పంచిగా పనిచేశారు. సిపిఎం సానుభూతిపరులుగా ఉంటూ సిపిఎం ప్రజా ఉద్యమాలను ఆయన బలపరుస్తూ వచ్చారు. ఈయన మృతి సమాచారం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యురాలు డి రమాదేవి సందర్శించి ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ నాగ వీర బసవయ్య లేకపోవడం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలకు పుట్టినిల్లుగా ఉన్న లంక గ్రామాల్లో ఆనాడు జరిగిన అనేక భూ పోరాటాలు రైతు సమస్యలు కూలి ధరల సమస్యలపై జరిగిన పోరాటాలకు అన్ని విధాలా తోడ్పాటు అందించిన వ్యక్తి నాగ వీర బసవయ్య అని కొనియాడారు. మృతునికి భార్య ఇరువురు కుమారులు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి జి సుధాకర్, కమిటీ సభ్యులు ఎం సత్యనారాయణ, జి. నాగరాజు, కే రామస్వామి, పి మనోజ్, రైతు సంఘం నాయకులు బిఎల్‌కె ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి సురేష్, బోరుగడ్డ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

ఎస్‌సిలకు రుణాలు ఇవ్వకుండా కాలయాపన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్‌ను వర్గీకరించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు పేరుతో, ఎస్‌సిలకు రుణాలు, ఉద్యోగాలు ఇవ్వకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాలయాపన చేస్తున్నారని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఒంగోలులోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాగేంద్రరావు మాట్లాడుతూ వర్గీకరణ అమలు చేసేంత వరకూ, రాష్ట్రంలోని ఎస్‌సిలకు సబ్సిడీ రుణాలు, ప్రభుత్వ ఉద్యోగాలను ఇవ్వొద్దని సుప్రీంకోర్టు ఏమైనా చెప్పిందా.? అని ప్రశ్నించారు. దేశంలోని ఆంధ్ర, తెలంగాణ మినహా మరి ఏ ఇతర రాష్ట్రంలోనూ ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లను వర్గీకరించడం లేదన్నారు. మాల వ్యతిరేకులు వారిపై విషం చిమ్ముతున్నారని, సుప్రీంకోర్టు తీర్పును మాల కులాన్ని అణగదొక్కేందుకు సాధనంగా వాడుతున్నారన్నారు. కూటమి పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్‌సి రిజర్వేషన్‌ను జిల్లాల వారీగా వర్గీకరిస్తామని ఇచ్చిన హామీని నాగేంద్ర తప్పు పట్టారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ఇటీవల జిల్లా యూనిట్ గా వర్గీకరణ చేయటం రాజ్యాంగ విరుద్ధమని చెప్పటాన్ని నాగేంద్ర స్వాగతించారు. జిల్లా యూనిట్‌గా రిజర్వేషన్లను అమలు చేస్తే మాల కులస్తులతో పాటు ఇతర ఎస్‌సి కులస్తులు కోర్టుకు వెళ్లి, రాజ్యాంగ విరుద్ధమైన జిల్లా యూనిట్ రిజర్వేషన్లను అమలు చేయకుండా స్టే తీసుకురావాలనేది కూటమి ప్రభుత్వ వ్యూహమన్నారు. ఈ వివాదాన్ని సాకుగా చూపి ఎస్‌సి కులాలకు ఇవ్వాల్సిన సబ్సిడీ రుణాలను, ప్రభుత్వ ఉద్యోగాలను కొంతకాలం పాటు అడ్డుకోవాలని కూటమి ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక బిసిలకు ఈడబ్ల్యుఎస్ పేరుతో పెత్తందారీ కులాలకు మాత్రమే రుణాలు ఇస్తున్నారని, ఎస్‌సి, ఎస్‌టిలకు ఇవ్వటం లేదన్నారు.

జగన్‌ను విమర్శించే అర్హత

'బాలినేని'కి లేదు

జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మాజీ సిఎం జగన్ గురించి గానీ, బూచేపల్లి కుటుంబం గురించి గానీ విమర్శించే అర్హత బాలినేని శ్రీనివాసరెడ్డికి లేదని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. ఆదివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైవి. సుబ్బారెడ్డి, వైఎస్.రాజశేఖరరెడ్డి, జగన్ పెట్టిన రాజకీయ భిక్షతోనే మంత్రి పదవులు, ఎమ్మెల్యే పదవులు బాలినేనికి దక్కాయన్నారు. అంతకు ముందు రాజకీయాలలో బాలినేని స్థాయి ఏంటో అందరికీ తెలుసని పేర్కొన్నారు. 2004 నుండి 2009, 2014,



మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

2024 ఎన్నికల వరకు బూచేపల్లి కుటుంబం గెలవకూడదని ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేశావని బాలినేనిని ఉద్దేశించి ఆరోపించారు. కానీ తాము ప్రజల్లో సంపాదించుకున్న మంచి పేరుతో నీ కుట్రలను ఛేదించుకొని ప్రజాక్షేత్రంలో విజయం సాధించామని చెప్పారు. నీలాగా ఇన్‌ఛార్జి పదవులు, సీట్లు ఇప్పిస్తానని ఎవ్వరిదగ్గర కూడా తాము డబ్బులు వసూళ్లు చేయలేదన్నారు. తన భర్త బూచేపల్లి సుబ్బారెడ్డి హయాం నుంచీ నేటి వరకు ఎవ్వరికైనా ఒక రూపాయి ఇచ్చే కుటుంబమే గానీ లాక్కునే కుటుంబం కాదని వివరించారు. 'నా జడ్పీ చైర్మన్ పీఠాన్ని బాలినేని లాగేస్తాడట.. ఎలా లాగేస్తాడో దమ్ము ధైర్యముంటే లాగేయమను' అని సవాల్ విసిరారు. ఈ పదవిని తనకు జగన్ ఇచ్చారని గుర్తు చేశారు. దీనిని లాగేసే హక్కు ఎవ్వరికీ లేదని వివరించారు. సమావేశంలో పలువురు వైసిపి మహిళా నాయకులు పాల్గొన్నారు.

15 రోజుల్లో

రూ.10 కోట్ల పన్నులు వసూలు చేయాలి

- మొబైల్ వాహనం ద్వారా పన్నులు చెల్లించొచ్చు..
- కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రెవెన్యూ సిబ్బంది, అడ్మిన్ సెక్రటరీలు అందరూ 15 రోజుల్లో తప్పనిసరిగా రూ.10 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేసి.. నగరపాలక సంస్థకి రావలసిన 16వ ఫైనాన్స్ నిధులు వచ్చేలా చేయాలని ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రాపర్టీ టాక్స్ వసూళ్లకు సంబంధించి నగర పాలక సంస్థ రెవెన్యూ సిబ్బంది, నగరంలో గల అన్ని సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో తమ ఛాంబర్‌లో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అడ్మిన్లు, రెవెన్యూ సిబ్బంది ప్రతిరోజూ ఉదయం 7:30 కల్లా తమ తమ సచివాలయ పరిధిలో ఉండి టాక్స్ వసూలు చేయాలన్నారు. ఎవరికీ ఎటువంటి మినహాయింపులూ లేవన్నారు. నగర ప్రజల సౌకర్యార్థం పన్ను చెల్లింపుల కోసం ఈ 15 రోజులు మొబైల్ వాహనం నగరంలో తిప్పుతున్నామని, ప్రజలు ఆఫీస్ వరకు రాకుండా ఆ వాహనం దగ్గర పన్నులు చెల్లించి.. రశీదు పొందవచ్చని సూచించారు. సమావేశంలో రెవెన్యూ ఆఫీసర్ విజయభాస్కర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శంకరశెట్టి శ్రీను, కళ్యాణి, క్రాంతి, నిరూప్, సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు



నిరసన తెలుపుతున్న కార్మికులు

'ఐఒసిఎల్ డిపో'ను కొనసాగించాలని నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

దాదాపు 26 సంవత్సరాల క్రితం నెలకొల్పబడి సుమారు 150 ట్యాంకర్లతో వివిధ నగరాలకు ఆయిల్, పెట్రోల్ అందిస్తున్న ఐఒసిఎల్ డిపోను కొనసాగించాలని ఆయిల్ ట్యాంకర్ వర్కర్స్ డిమాండ్ చేశారు. ఆదివారం నాడు సూరారెడ్డిపాలెం ఏరియా ఐఒసీ, బీపీసీ కంపెనీస్ ట్యాంకర్ వర్కర్స్ అండ్ అదర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు నిరసన చేపట్టారు. ప్రకాశం జిల్లాతో పాటు పలు జిల్లాలకు డీజిల్, పెట్రోల్ అవుట్‌లెట్స్‌కు ట్యాంకర్ల ద్వారా రవాణా చేస్తున్న ఐఒసీ డిపోను ఖర్చులు, వ్యయం పేరుతో మూసివేయాలని యాజమాన్యం నిర్ణయించడం సరికాదన్నారు. కరోనా సమయములో సైతం ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు, క్లీనర్లు ఇతర సిబ్బంది ప్రాణాలు సైతం లెక్కచేయక సేవలను కొనసాగించినట్లు గుర్తు చేశారు. డిపోను యధావిధిగా కొనసాగించాలని కోరుతూ ప్రభుత్వానికి సిఫార్సు చేయాల్సిందిగా డీఆర్‌ఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు, అధ్యక్షులు శ్రీరామ్‌శ్రీనివాసరావు, కార్యదర్శి టి నరసయ్య, నాయకులు కే.హరిబాబు పాల్గొన్నారు.

21న కవితా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

నరసం (నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం), కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థల సంయుక్త నిర్వహణలో ఈ నెల 21న శుక్రవారం ఉదయం పది గంటలకు స్థానిక జిల్లా గ్రంథాలయంలో ప్రపంచ కవితా దినోత్సవ వేడుకల్ని నిర్వహిస్తున్నట్లు నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, కళామిత్రమండలి సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు ఒక ప్రకటనలో వెల్లడించారు. సభానంతరం ఆహ్వాన కమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పొట్టి శ్రీరాములుకి ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ దామోదర్, పోలీస్ అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పడమటపల్లిలో గురవయ్య మరియు మహాలక్ష్మమ్మ దంపతులకు జన్మించారని, ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ కఠోర నిర్ణయంతో 58 రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి తన ప్రాణాలను అర్పించారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎస్ బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, ఒంగోలు తాలూకా అజయ్ కుమార్, ఆర్ఐ రమణారెడ్డి, ఏఆర్ ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ దామోదర్

బాపట్ల జిల్లా: పొట్టి శ్రీరాములు జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి అడిషనల్ ఎస్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ తో పాటు ఎస్.బి సి.ఐ నారాయణ, ఆర్ఎస్ఐ సుధాకర్, ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



బాపట్లలో నివాళులర్పిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వర్

ఇపిఎఫ్ కనీస పెన్షన్ అమలెప్పుడో.?

- కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి
- 18న ఇపిఎఫ్ కార్యాలయాల పికెటింగ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సంఘటిత రంగంలో పదేళ్ల పైబడి పర్మినెంట్ ఉద్యోగిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు నిర్దేశించిన 'ఈపీఎఫ్ పెన్షన్ 1995 పథకం' అమలుపై ప్రభుత్వం తీవ్ర అలసత్వం చూపుతోంది. కేంద్ర ప్రభుత్వ హామీ మేరకు ఈపీఎఫ్ కనీస పెన్షన్ అమలు ప్రశ్నార్థకంగా మారింది. వివిధ రంగాల్లో పనిచేసే ఉద్యోగులు, సంస్థలు ఇపిఎఫ్ ఖాతాలకు జమ చేసిన మూలధనంలోని(కార్పస్ ఫండ్) వాటా ప్రకారం పెన్షన్ గా ఉద్యోగులకు తిరిగి చెల్లించడంలో కేంద్రం దాటవేత ధోరణితో వ్యవహరిస్తోంది. ఈ కారణంగా వివిధ రంగాల పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థలు ప్రభుత్వ సంస్థల్లో కాంట్రాక్ట్ పద్ధతిని పనిచేసిన ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉద్యోగ విరమణ పొందిన అనంతరం చాలీచాలని పెన్షన్‌తో దయనీయమైన జీవితాలను గడుపుతున్నారు.



కనీస పెన్షన్ రూ.9 వేల కోసం..

పెరుగుతున్న నిత్యావసరధరలు, జీవనప్రమాణాల రీత్యా కనీస పెన్షన్ రూ 9,000 అమలు చేయాలని దేశవ్యాప్తంగా గత అయిదేళ్లుగా పెన్షనర్ల అసోసియేషన్లు ఆందోళనలు చేపడుతున్నాయి. అయినప్పటికీ కనీస పెన్షన్ కేవలం రూ.వెయ్యి నుంచి ఒక్క రూపాయి పెంచిన దాఖలాలు లేవు. కనీస పెన్షన్‌గా రూ.9 వేలు అమలు చేయాలని పెన్షనర్లు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం వద్ద నిల్వ ఉన్న పెన్షనర్ల సొమ్మును(కార్పస్ ఫండ్) కార్పొరేట్లకు కేటాయించడానికి ప్రభుత్వం యోచిస్తుందన్న ఆరోపణలున్నాయి.

కనీస పెన్షన్ నోచుకోక..

ప్రభుత్వ రంగాల్లో 30 నుంచి 35ఏళ్ళ పాటు కాంట్రాక్ట్ పద్ధతిన సేవలందించే అంగన్వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్స్, మున్సిపల్, పంచాయతీ, వెలుగు, ఎన్ఆర్‌జిఎస్ వివిధ స్కీం వర్కర్లకు సంబంధించి కనీస పెన్షన్ అమలు కావడం లేదు. ఆప్కాస్ పద్ధతిలో నియామకమైన అన్ని శాఖలలో పనిచేస్తున్న సిబ్బందికి పెన్షన్ అమలు చేయవలసి ఉంది.

కనీస పెన్షన్ రూ.9 వేలివ్వాలి

జి.శేషయ్య, అధ్యక్షులు, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్

జిల్లాలో 7900 ఈపీఎఫ్ పెన్షనర్లు ఉండగా రూ.5 వేల పైబడి పెన్షన్ అందుతున్నవారు అది తక్కువ మంది మాత్రమే ఉన్నారు. కనీస పెన్షన్ రూ.7500 అమలు చేస్తామని గతంలో కేంద్రం హామీ ఇచ్చింది. పెరుగుతున్న ధరల రీత్యా కనీస పెన్షన్ రూ.9 వేలు అమలు చేయాలి.

పికెటింగ్‌ను జయప్రదం చేయాలి

సిహెచ్ రాంబాబు, ప్రధాన కార్యదర్శి, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్

కనీస పెన్షన్ సాధన కోసం 'ఆంధ్రప్రదేశ్ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్' రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఈనెల 18న ఒంగోలు ఈపీఎఫ్ కార్యాలయం వద్ద పికెటింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ఈపీఎఫ్ పెన్షనర్లు అందరూ 18న ఉదయం 9 గంటలకు ఈపీఎఫ్ కార్యాలయం వద్దకు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి.

పంటలకు మద్దతు ధర ఇవ్వాలి

• ప్రజాచైతన్య యాత్ర ఎదుట రైతుల విజ్ఞప్తి



రైతులతో మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-దర్శి

పంటలకు కనీస మద్దతు ధరల చట్టం లేనందున ఏ పంట వేసినా గిట్టుబాటు గాని పరిస్థితి ఏర్పడుతున్నదని, ధరల స్థిరీకరణకు నిధులు పెంచి, మద్దతు ధరల చట్టం ద్వారా రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని రాజంపల్లి, లక్ష్మీనారాయణపురం, కొత్తపల్లి గ్రామాల్లోని రైతులను, గ్రామీణ ప్రజలను ఆదివారం కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 1010రకం వరి ఒక ఎకరం పండించేందుకు సగటున రూ.40వేల వరకు ఖర్చు అయిందని లక్ష్మీనారాయణపురంలో రైతులు తెలిపారు. ప్రస్తుతం బస్తా రూ.1400కు మాత్రమే కొంటున్నారని, కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసే వారికి నష్టాలు తప్ప ఏమాత్రం మిగిలే అవకాశమే లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి, ప్రభుత్వం ఈ ధాన్యానికి కనీసం బస్తా రూ.1800 మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేస్తే తాము కోలుకుంటామని రైతులు సిపిఎం బృందం వద్ద విన్నవించారు. ప్రభుత్వ మద్దతు ధరల చట్టం లేనందున పురుగు మందుల షాపుల్లో అప్పులు, ఇతరుల దగ్గర వడ్డీకి తెచ్చిన అప్పులు, కూలీలకు చెల్లింపులు చేసేందుకు గత్యంతరం లేక పంటను తక్కువ ధర కైనా తెగనమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతుల పెట్టుబడి ఖర్చుకు ఒకటిన్నర రెట్లు కలిపి మద్దతు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. పంట చేతికొచ్చే సమయంలో రైతాంగాన్ని ఆదుకునేందుకు ధరల స్థిరీకరణకు రూ.3వేల కోట్లు కావాలని వ్యవసాయ రంగ నిపుణులు కోరుతుంటే రాష్ట్ర బడ్జెట్లో కేవలం రూ.300 కోట్లు మాత్రమే కేటాయించడం విచారకరమన్నారు. అన్నదాత సుఖీభవ కూడా బడ్జెట్లో రూ.10,700 కోట్లు అవసరం కాగా రూ.6,300 కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. ఈ నిధులతో అన్నదాతలు ఎలా సుఖీభవం పొందుతారని, పంటల పండగ ఎలా చేస్తారని ఆయన ప్రశ్నించారు. బడ్జెట్లో నిధులు పెంచి కనీస మద్దతు ధరల చట్టం చేయడం ద్వారా రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో మిర్చి, వరి, కంది వంటి పంటలకు గిట్టుబాటు ధర లేక కొంత ఆశాజనకంగా ఉన్న బర్లీ పొగాకు పంట ఇటీవల కాలంలో ఎక్కువగా వేశారని అన్నారు. నాణ్యమైన పొగనారు దొరకని కారణంగా ఈ సంవత్సరం దిగుబడులు బాగా తగ్గుతున్నాయన్నారు. గత ఏడాది ఎకరాకు 13, 14 క్వింటాలు దిగుబడిరాగా, ఈ సంవత్సరం అది 8 క్వింటాలకు తగ్గిపోయిందని అన్నారు. రేటు కూడా గత సంవత్సరం క్వింటాలకు రూ.15వేలు ఉండగా ఈ సంవత్సరమది రూ.13500కి పడిపోయిందని అన్నారు. క్వింటా కనీసం రూ.15,500కి కొనుగోలు చేస్తేనే రైతులకు గిట్టుబాటు అవుతుందన్నారు. ప్రభుత్వం పరిశీలన చేసి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తపల్లి, రాజంపల్లి గ్రామాల్లోని నివాస ప్రాంతాల్లో మురుగునీటి కాలువల శుభ్రత మీద ప్రత్యేక శ్రద్ధ లేనందున దళిత వాడలు మురికి కూపాలుగా మారాయని అన్నారు. ప్రతి గ్రామంలో ఈ సమస్య తీవ్రంగా ఉందన్నారు. పంచాయతీలకు నిధులు పెంచి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కెవి పిచ్చయ్య, ఉప్పు నారాయణ పాల్గొన్నారు.

దొనకొండ : వెనుకబడిన దొనకొండకు వెలిగొండ నీరు వస్తేనే మండలం అభివృద్ధి చెందుతుందని సీపీఎం కార్యదర్శి చిరుపల్లి అంజయ్య పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించి పనులు పూర్తి చేసి మొదటి టెన్నల్ నుండి నీరు విడుదల చేయాలని కోరుతూ ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో సీపీఎం ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నిమిత్తం ఈనెల 20న మార్కాపురం ఆర్డీఒ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా జరుగుతుందన్నారు. గ్రామాల్లోని రైతులు, రైతు కూలీలు స్వచ్ఛంధంగా హజరుకావలాని కోరారు. 1996లో వెలిగొండకు శంఖుస్థాపన చేసి నేటికి 20 ఏళ్లయినా నీరు విడుదల చేయకపోవటం పాలక పార్టీల నిర్లక్ష్యంకు నిదర్శనమన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఎవరు సీఎం అయినా ఎక్కువ నిధులు కేటాయించకపోవటమే అసలు కారణమని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తాండవ రంగారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి మార్కాపురం వచ్చి తానే వెలిగొండ ప్రాజెక్టుకు శంఖు స్థాపన చేశానని, తానే పూర్తి చేస్తానని అనటం అన్యాయం అన్నారు. రూ.4వేల కోట్లు నిధులు అవసరమైతే బడ్జెట్లో రూ.359 కోట్లు కేటాయించి ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం పూర్తి కాకుండానే ప్రజలకు ప్రాజెక్టు అంకితం చేస్తున్నానని చెప్పి మోసమే చేసిందని, ఇద్దరూ ప్రజలకు మాయమాటలే చెబుతున్నారని విమర్శించారు. దొనకొండ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే వెలిగొండ ప్రాజెక్టు, పరిశ్రమలు వస్తేనే సాధ్యమన్నారు. జిల్లా వ్యాప్తంగా మార్కాపురం, కనిగిరి, ఒంగోలు ఆర్డీఒ ఆఫీసుల వద్ద ధర్నాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిన్ననర్సింహులు, కోలా కిరణ్‌కుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న సీపీఎం దొనకొండ ప్రతినిదులు



ఎదురువారి వివాహానికి హాజరైన బూచేపల్లి వెంకాయమ్మ

వివాహ వేడుకల్లో 'బూచేపల్లి'

ప్రజాశక్తి-దర్శి

పట్టణంలోని కొత్తపాలెంలో ఎదురు చిన్న కొండారెడ్డి, కోటమ్మ కుమారుడు మధుసూదన్‌రెడ్డి, లక్ష్మి వివాహానికి జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సోము దుర్గారెడ్డి, కర్ణ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

అమరజీవికి ఘన నివాళి

ప్రజాశక్తి-కనిగిరి

పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగంతో ఆంధ్ర రాష్ట్రం అవతరణ జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన క్యాంపు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు షేక్ ఫిరోజ్, తమ్మినేని వెంకటరెడ్డి, రాచమల్ల శ్రీనివాసరెడ్డి, గుడిపాటి ఖాదర్, చింతలపూడి తిరుపాలు, ఆర్‌వి నారాయణ పాల్గొన్నారు.



అమరజీవి చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిఐ, ఎస్ఐ

దర్శి : అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి వేడుకలు స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబరు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ మురళి అధ్యక్షత వహించగా సిఐ వై రామారావు, విశ్రాంత డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమీషనర్ గంగవరపు ఆదినారాయణ, కపురం శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. విశ్రాంత డీటీసి గంగవరపు ఆదినారాయణ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చాలా పట్టుదల గలవారని అన్నారు. నిగ్రహశక్తిని ఎప్పటికీ కోల్పకుండా ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాద్యాయులు ఎస్ఎన్‌సిహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

దర్శి : దర్శనాపురి వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు దేసు సంధ్యారాణి, కార్యదర్శి కొల్లూరి సుశీల, కోశాధికారి తెల్లాకుల సత్యలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక తాలూకా ప్రభుత్వ పాఠశాలలో ఆంధ్ర రాష్ట్ర అవతరణకు తన ప్రాణాలను పణంగాపెట్టి పోరాడిన పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులను అర్పించారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ మునగా లక్ష్మీ, క్లబ్ మెంబర్స్ చిన్నమనగుండ్ల మహేశ్వరి, పోలేపల్లి సౌజన్య, బండారు శ్రీలక్ష్మి, చందలూరి సావిత్రి, పరుచూరి సుభాషిని పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

ప్రజాశక్తి - సిఎస్ పురం రూరల్

10వ తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ జె ప్రసాదరావు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కెజిబివి, రెండు ప్రైవేటు పాఠశాలలకు చెందిన 350 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు సిఎస్‌పురం జెడ్‌పి ఉన్నత పాఠశాల, రత్నం జూనియర్ కాలేజీలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 10 గదుల్లో 210 మంది, రత్నం జూనియర్ కాలేజీలో 7 గదుల్లో 140 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో పరీక్షలు నిర్వహించే 10 గదుల్లో, పరీక్షల చీఫ్ అధికారికి కేటాయించిన గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రానికి పరీక్షల చీఫ్, డిపార్ట్మెంట్ అధికారులుగా అబ్దుల్ సుభాన్, భాష, రత్నం జూనియర్ కాలేజీ పరీక్ష కేంద్రానికి చావా శ్రీనివాసులు, కాజా రహమతుల్లాను నియమించినట్లు చెప్పారు. 17న సోమవారం పరీక్షలు ప్రారంభం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ అధికారులు, డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో 630 మంది 10వ తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఎంఇఒ ఎస్‌కె డాంగేషరీఫ్, బి నరసింహారావు ఆదివారం తెలిపారు. గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 210 మంది విద్యార్థులు, మర్రిపాలెంలో 120 మంది, పెదారికట్లలో130 మంది, అంబేద్కర్ వెలుగొండ గురుకుల కళాశాలలో 170 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పెదారికట్ల పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపర్నెంట్‌గా పద్మావతి, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా బివిరెడ్డి, గొట్టగట్టు జిల్లా పరిషత్‌కు సెంటర్‌కు చీఫ్ సూపరింటెండెంట్‌గా కరీమున్, డిప్యూటీ సూబార్డినెంట్‌గా జయకృష్ణ, మరిపాలెం సెంటర్‌కు చీఫ్‌సూపరింటెండెంట్‌గా కామారెడ్డి, పి రమణరెడ్డి, అంబేద్కర్ వెలుగొండ గురుకుల కళాశాల సెంటర్‌కు చీఫ్ సూపరింటెండెంట్‌గా హాజీం బాషా, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా నాగేశ్వరావును నియమించినట్లు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు.

పిసిపల్లి : మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు నేడు ప్రారంభం కానున్నాయి. ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు పరీక్షలు జరుగుతాయని ఎంఇఒ జి సంజీవ్, శ్రీనివాసులు తెలిపారు. విద్యార్థులు పరీక్ష సామాగ్రి మినహా సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావద్దని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద నలుగురికి మించి ఉండకూడదని, సమీపంలో జెరాక్స్ సెంటర్లు పరీక్షల సమయంలో తెరవ వద్దని నిబంధనలు అమలులో ఉన్నట్లు తెలిపారు. చట్ట వ్యతి రేక కార్యకలాపాలు జరగకుండా పోలీసు బందోబస్తుతోపాటు పరీక్షల నిర్వహణకు తనిఖీ అధికారులను నియమించినట్లు తెలిపారు.



అదుపుతప్పి ఇంటి వైపుకు దూసుకెళ్లిన లారీ

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - కురిచేడు

దొనకొండ మండలం ఇళ్లచెరువు గ్రామం నుండి మిర్చి లోడుతో గుంటూరు వెళ్తున్న ఐషర్ వాహనం కురిచేడులోని జెండా చెట్టు వద్ద అదుపుతప్పి గృహాలవైపు దూసుకు వెళ్ళింది. ఆ సమయంలో ఇళ్ల బయట ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అదే క్రమంలో వెంగాయపాలెం నుండి కురిచేడుకు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్నది. వాహన చోదువుడికి గాయాలు కాలేదు కానీ వాహనం దెబ్బతిన్నది.

ఎడ్ల పందేలు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని గార్లదిన్నె పంచాయితీ శ్రీ వెలుగొండ వెంకటేశ్వరస్వామి దేవస్థానం సన్నిధిలో శ్రీవేంకటేశ్వర స్వామి తిరుణాల సందర్భంగా జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కమిటీ అధ్యక్షులు కుందూరు కాశిరెడ్డి తెలిపారు. వెలుగొండ బ్రహ్మోత్సవాలు ఈనెల 13 నుండి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 21, 22 తేదీల్లో దేవస్థానం సన్నిధిలో ఎడ్ల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుణాల సందర్భంగా ప్రతి ఏటా ఎడ్ల పోటీలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ఎడ్ల యజమానులు ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

వామపక్ష, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-చీరాల

మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో 31 వార్డు విజిలిపేట దండుబాటలో సుమారు రూ.8 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణాన్ని నిలుపుదల చేసి ఆ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఖాళీ భూములను పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ వామపక్ష పార్టీలు, ఇతర ప్రజా సంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటీజన్స్ కార్యాలయంలో వామపక్ష ప్రజాసంఘాల నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం చీరాల ప్రాంతీయ కార్యదర్శి ఎన్ బాబురావు మాట్లాడుతూ ఈ ప్లాంట్‌కు అతి సమీపంలో సెయింట్ ఆన్స్ స్కూల్‌లో సుమారు 5000 మంది చిన్నపిల్లలు చదువుకుంటున్నారని



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం చీరాల ప్రాంతీయ కార్యదర్శి, బాబురావు

తెలిపారు. ఈ ప్లాంట్ చుట్టూ 15,000 మంది దళితులు, గిరిజనులు నివాసముంటున్నా రన్నారు. కేవలం 70 మీటర్ల దూరంలోనే 500 కుటుంబాలు నివశిస్తున్నారని, ప్లాట్ నిర్మాణం ఇక్కడ చేపట్టడం ప్రకృతి విరుద్ధమని అన్నారు. పంట పొలాలు కూడా ఈ నీటివల్ల కలుషితం అవుతున్నట్లు తెలిపారు. భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కావున ప్లాంట్ నిర్మాణాన్ని ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా కేవలం కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం అధికారులు మొండిగా అక్కడే ప్లాంట్ నిర్మాణం చేయతలపెట్టడం దుర్మార్గం అన్నారు. తక్షణమే అధికారులు ప్రయత్నాలు విరమించుకోకుంటే ఆందోళన తప్పదు అని హెచ్చరించారు. ఈ ప్రాంతంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను పేదలకు ఇళ్ళ స్థలాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం చీరాల ప్రాంతీయ కార్యదర్శి ఎన్ బాబురావు, సీపీఐ నాయకులు ఎమ్ వెంకట్రావు, చీరాల అభివృద్ధి సాధన సమితి నాయకులు శీలం రవికుమార్, ఏ బాబురావు, సీనియర్ సిటీజన్స్ నాయకులు ఏ రామారావు, జి హరిహరరావు పాల్గొన్నారు.

పాఠశాల ప్రాధాన్యతల కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-సంతమాగులూరు

విద్యార్థులలో సజనాత్మక శక్తిని గుర్తించి ప్రోత్సహించడమే తమ లక్ష్యమని పూర్వ కార్తికేయ విద్యాసంస్థల అధినేత ఇండస్ వ్యాలీ విద్యాసంస్థల ఎండి యశోద శివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సంతమాగులూరు లో ఉన్న కార్తికేయ మహిళా జూనియర్ కళాశాల ప్రాంగణంలో 2025-26 విద్యా సంవత్సరం నుండి నూతనంగా నర్సరీ నుండి పదవ తరగతి వరకు పాఠశాల ప్రారంభాన్ని పురస్కరించేందుకు, పాఠశాల ప్రాధాన్యత గల కరపత్రాన్ని ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రముఖ గౌతమి విద్యాసంస్థ ల అధినేత కనుమర్ల గుండారెడ్డి, మరియు పాఠశాల నూతన సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌతమి విద్యాసంస్థల అధినేత గుండారెడ్డి మాట్లాడుతూ నూతన విద్య విధానానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకుంటూ విద్యార్థులను ప్రపంచ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం చేసే విధంగా తమ విద్యా ప్రణాళికలు రూపొందించామన్నారు. సంతమాగులూరు పరిసరాలలో ఇప్పటివరకు అందుబాటులో లేని అన్ని రకాల విద్య, క్రీడా వనరులను తమ పాఠశాలలో అందుబాటులో ఉంచుతామన్నారు. గ్రామీణ వాతావరణంలో కార్పొరేట్ విద్యాసంస్థలతో విద్యాబోధన లో పోటీ పడటమే



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాకుండా విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలిగించే విధంగా ఆధునిక వసతులతో క్రీడా మైదానం కూడా ఉందన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడా నైపుణ్యాన్ని కూడా గుర్తించి వారికి తగిన శిక్షణ ఇచ్చి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. గ్రామీణ విద్యార్థులకు అందుబాటు ఫీజులతో నాణ్యమైన విద్యాబోధన ఉంటుందన్నారు. అంతేగాక తమ పాఠశాలలో వంద శాతం క్వాలిఫై ఉపాధ్యాయ బందం ఉంటుందన్నారు. విద్యార్థులకు బాల్యం నుండి ప్రపంచ స్థాయి విద్యాభ్యాసం సరళీకత విధానం ద్వారా అందించనున్నామన్నారు. బాల బాలికలకు ప్రత్యేక వసతులు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి రాజేశ్వరి, సంస్థ అకడమిక్ ఫోగ్రామర్ కూరపాటి సత్యనారాయణ, జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లయోధుడు శివకుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి బాపట్ల

ఇనుప కండరాలు ఉక్కు నరాలు వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి అవసరం అన్న స్వామి వివేకానంద ప్రేరణతో యువకులకు కర్ర సాము ,కత్తి సాము ,మల్ల యుద్ధము వంటి ప్రాచీన భారత యుద్ధ విద్యలు ఉచితంగా నేర్పిన శ్రీవల్లి శివకుమార్ నిజమైన దేశ భక్తులని సాహితీ భారతి అధ్యక్షులు రావూరి



శివకుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నరసింహ వర్మ కొనియాడారు. ఆదివారం బాపట్ల జమేదారు పేటలోని సాహితీ భారతి కార్యాలయంలో జరిగిన శివకుమార్ కుసన్మాన సభ నిర్వహించారు. నరసింహ వర్మ మాట్లాడుతూ ప్రముఖ సినీ నటులు ఎన్టీ రామారావు, శివాజీ గణేషన్, ఎంజీఆర్, కన్నడ రాజ్ కుమార్ వంటి మహామహులకు కత్తి సాము నేర్పిన చరిత్ర శివకుమార్ కు ఉందని ప్రశంసించారు.ప్రముఖ రంగస్థల, టీవీ నటులు మున్నం మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిఫలం ఆశించకుండా ఎందరో యువకులకు మార్షల్ ఆర్ట్స్ నేర్పిన త్యాగధనులు శివకుమార్ అన్నారు. నాటి కర్ణాటక ముఖ్యమంత్రి నిజలింగప్ప చే మహాబలుడు అనే బిరుదు తో పాటు సూపర్ మాన్, ఆంధ్ర టైగర్, వీరాధివీర వంటి బిరుదులు శివకుమార్ అందుకున్నారన్నారు. సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ బ్రిటిష్ వారి హయాంలో మీటర్ గేజ్ రైలుతో పోటీపడి పరిగెత్తి రైలు కన్నా ఐదు నిమిషాలు ముందుగా గమ్యస్థానాన్ని చేరుకున్న ఘనత శివకుమార్ దన్నారు. సభలో ప్రముఖ సాహితీవేత్త కాళిదాసు,ఎం. జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

రోగి ప్రాణాలు కాపాడటంలో..

వైద్యునికి సమయం ఎంతో విలువైంది

ప్రజాశక్తి-ఇంకొల్లు

మెదడుకు, గుండెకు సంబంధించిన పక్షవాతం, మూర్ఛ వ్యాధులతో పాటు, ఏదైనా అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు రోగి ప్రాణాలు కాపాడటంలో ప్రతి నిమిషం వైద్యునికి, రోగికి ఎంతో విలువైనదని ప్రముఖ న్యూరాలజిస్ట్ వైద్య నిపుణులు అబ్బూరి రవీంద్రబాబు అన్నారు. ఆదివారం ఇంకొల్లు పర్చూరు రోడ్‌లో నూతనంగా ప్రారంభించిన చెరుకూరి సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం తనకు కొత్త అయినప్పటికీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గత 11 ఏళ్లుగా ఒంగోలులో దాదాపు 7వేల న్యూరో సంబంధిత ఆపరేషన్ కేసులు పరీక్షించి మెరుగుపరిచినట్లు తెలిపారు. ఈ ఆధునిక పోటీ ప్రపంచంలో వైద్యాన్ని వ్యాపార దృక్పథంతోనే కాకుండా, రోగుల యొక్క ఆర్థిక పరిస్థితి గమనించి వీలైనంత తక్కువ ఖర్చుతో రోగి ప్రాణాలు కాపాడటానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఆర్జించే డబ్బు కన్నా మనిషి యొక్క ప్రాణం కాపాడిన సంతృప్తితో పాటు జబ్బులు నయం చేసినప్పుడే ఎక్కువ ఆనందం ఇస్తుందని తెలిపారు. గైనకాలజిస్ట్ వైద్య నిపుణురాలు ఎర్రమోతు



వైద్యశాలను ప్రారంభిస్తున్న డాక్టర్ అబ్బూరి రవీంద్రబాబు

రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల అభిమానాన్ని పొందే విధంగా వైద్య సేవలు అందించి ముందుకు సాగుతామని అన్నారు. 24 గంటలు సాధారణ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఎప్పుడూ ఉంటారని అన్నారు. జనరల్ ప్రసూతి వైద్యాలతో పాటు గుండె, నరాలు ఎముకలు, మెదడు కంటి జీర్ణకోశ వ్యాధులకు సంబంధించిన ప్రముఖ వైద్యులు కూడా పరీక్షలు నిర్వహిస్తారని, తెలిపారు. హాస్పిటల్ ఎండి చెరుకూరి రామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో టెక్నాలజీతో కూడిన ఆధునిక వైద్యం ప్రజలకు అందుబాటులో తెచ్చి సేవ చేయటానికి ఈ వైద్యశాలను ప్రారంభించినట్లు తెలిపారు. రోగిని పరీక్షలు నిర్వహించి రోగి యొక్క వ్యాధి నిర్ధారణ చేసి తక్కువ ఖర్చుతో రోగ నివారణ చేసే విధంగా వైద్యులు పనిచేస్తారని అన్నారు. రోగి అవసరాన్ని బట్టి తెలియజేస్తే ప్రముఖ వైద్యులు కాన్ఫరెన్స్ విధానంలో కూడా వైద్య సేవలు చేస్తారని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు ఎక్కువ దూరం పోకుండా ప్రమాదాల సమయంలో కూడా ఈ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల అందుబాటులో ఉండటం హర్షణీయమని యువ పారిశ్రామికవేత్త లాయిడ్ ఫార్మసిటికల్ సంస్థ అధినేత విక్రం నారాయణరావు అన్నారు. ప్రజాభిమానాన్ని త్వరలో చూడమని మరింత అభివృద్ధి బాటలో వైద్యశాల నడవాలని అన్నారు. వైద్యశాల ప్రారంభం సందర్భంగా ఆదివారం దాదాపు 345 మందికి వివిధఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి వీరగంధం ఆంజనేయులు మాజీ ఎంపీపీ భవనం శ్రీనివాసరెడ్డి చిన్నగంజాం మండల టిడిపి అధ్యక్షులు పొద వీరయ్య, ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు మరియు మండలం పరిధిలోని పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు, వైద్యులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఈవో పురుషోత్తం

నేటి నుంచి 'పది' పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-బాపట్ల

జిల్లాలో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరాం పురుషోత్తం ఆదివారం తెలిపారు. జిల్లావ్యాప్తంగా పది పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి 12:45 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందుగా విద్యార్థులు చేరుకోవాలన్నారు. జిల్లాలో 103 పరీక్షా కేంద్రాల్లో 16,799 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని డీఈఓ వివరించారు. 8482 విద్యార్థులు, 8317 మంది విద్యార్థినులు పది పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు సౌకర్యం కల్పించామన్నారు. బస్సులు విద్యార్థులను పరీక్షా కేంద్రాల వద్దకు చేర్చే విధంగా ఆర్టిసి అధికారులతో సంప్రదించి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించామన్నారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రం నుంచి 100 మీటర్ల పరిధిలో ఎలాంటి జిరాక్స్ షాప్‌లు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి విద్యార్థి హాల్ టికెట్‌పై ఆర్‌టీసి బస్‌లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. పరీక్షా కేంద్రాలకు సెల్ ఫోన్లు తీసుకువెళ్లేందుకు అనుమతి లేదన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతి ఉందన్నారు. ఆ ఫోన్లో కెమెరా ఆన్ చేయకూడదన్న నిబంధనలు ఉన్నాయన్నారు.

12 పరీక్షా కేంద్రాలు

బాపట్లలో 12 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని డీఈవో తెలిపారు. పట్టణంలో రవీంద్ర భారతి స్కూల్, సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల, కొండు బొట్ల పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏవీవీ ఉన్నత పాఠశాల, లిటిల్ ఏంజిల్స్ ఉన్నత పాఠశాల, నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూలు, బాపట్ల హైస్కూలు, శ్రీ చైతన్య హైస్కూలు, మునిసిపల్ హైస్కూలు, ప్రభుత్వ బదిరుల ఆశ్రమ పాఠశాల, అప్పికట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెరువు జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఈవో తెలిపారు.

సంతమాగులూరు మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలు

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలో నేడు జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి వేమవరపు కోటేశ్వరరావు తెలిపారు. నాలుగు పరీక్ష కేంద్రాలైన సంతమాగులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 259 మంది విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల లో 204 మంది, ఏల్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 118 మంది, మక్కెన వారి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 120 మంది పరీక్షలకు హాజరవుతున్నారని ఎంఈఓ తెలిపారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే తాటిపర్తి

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువులో ముస్లింల ఇఫ్తార్ విందులో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం పాల్గొన్నారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లింలు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు అకుంఠిత దీక్షతో ఉపవాసం ఉండడం గొప్ప విషయమన్నారు. ముస్లిం సోదరులు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. వైసిపి నాయకులు శ్రీనివాసరెడ్డి, భూమిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో డ్రోన్ నిఘా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేయాలని లక్ష్యంగా డ్రోన్ కెమెరా లతో క్షేత్రస్థాయిలో ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో నిఘా ఏర్పాటుచేశారు. నిర్మానుష్యమైన ప్రదేశాలలో డ్రోన్‌లతో నిఘా పెట్టి,చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు జిల్లా పోలీసులు అడ్డుకట్టు వేస్తున్నారు. పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టణ, చివర ప్రాంతాలలో బహిరంగంగా మద్యం సేవించడం, పేకాట, ఈవిటీజింగ్, చైన్ స్నాచింగ్, పేకాట, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, జూదం తదితర నేరాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. ఆయా ప్రాంతాల్లో బహిరంగ మద్యం సేవించడం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ, ఈవ్‌టీజింగ్, ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ కార్యాలయ అధికారులు తెలిపారు.

ఎంపీ మాగుంటకు అభినందనలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరం పడమర వైపు బైపాస్ ఏర్పాటు చేయాలని కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దష్టికి తీసుకెళ్ళిన ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా మధు అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి రెండో బైపాస్‌పై అర్జీ ఇచ్చారన్నారు. ఈమధ్య కాలంలో నేషనల్ హైవే, ఆర్ అండ్ బి అధికారులు స్పందించి పార్లమెంట్ సభ్యుని కలిశారన్నారు. రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధనరావు, సంతనూతలపాడు శాసన సభ్యులు బిఎన్ విజయకుమార్ ఉన్నతాధికారులతో త్వరలో దిశా సమావేశమై పశ్చిమ బైపాస్ నిర్మాణ సన్నహాలు చేస్తున్నట్లు వార్తలు రావడం సంతోషమన్నారు. రాబోయే కాలంలో జిల్లా,నగర ప్రజలకు ఒంగోలు నగరం అభివద్ధి కి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. పశ్చిమ బైపాస్ నిర్మాణం చేపట్టాలని కోరారు.

తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నాం..

ప్రజాచైతన్య యాత్రలో పీర్లమాన్యం వాసుల ఆవేదన



పీర్లమాన్యంలో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

గత 30 సంవత్సరాలుగా ఇక్కడ నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నామని, తాగునీరు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని పీర్లమాన్యం వాసులు సిపిఎం నేతల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యంలో సిపిఎం ప్రజాచైతన్య యాత్ర బందం ఆదివారం పర్యటించింది. ఈ సందర్భంగా ప్రజలు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను బృందం దృష్టికి తీసుకొచ్చారు. మంచినీటి కుళాయిల కనెక్షన్ ఇస్తేనే సమస్య నుండి శాశ్వతంగా బయటపడతామని తెలిపారు. ముస్లిములకు స్మశానం పోతురాజు కాలవ కట్ట పక్కన ఉందని, అక్కడికి పోవడానికి దారిమార్గంలో చిల్ల చెట్లు మొలిచి.. ఇబ్బందిగా ఉందని, దారిని శుభ్రం చేయించాలని వారు కోరారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు మాట్లాడుతూ ప్రభుత్వం రూ.123 కోట్ల అంచనాతో గత పదేళ్ల క్రితం ఓవర్‌హెడ్ ట్యాంకు, సమ్మర్ స్టోరేజ్‌లను పీర్లమాన్యం ఎదురుగా గల కర్నూలు రోడ్డు పక్కన ప్రారంభించారని, దానిని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. దానికి వెంటనే నిధులు కేటాయించి ఓవర్‌హెడ్ ట్యాంకు సమ్మర్ స్టోరేజ్ పూర్తి చేసి పీర్లమాన్యం, ఎస్టీ కాలనీ, అరుణోదయ కాలనీ, గణపతి నగర్, విరాట్ నగర్, శ్రీకష్ణ నగర్, సమతా నగర్, మంగమూరు రోడ్డు, రాజీవ్ నగర్, లింగారెడ్డి కాలనీ, అమరావతి నగర్, మర్రి చెట్ల కాలనీ, తదితర కాలనీలలో ప్రజలకు మంచినీళ్ల ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బందంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు, నాయకులు కోదూరు రామకష్ణారెడ్డి, షేక్ కాలేషా, లక్కు తిరుపతయ్య, పి చిన్న శేషయ్య, బంకా పద్మ, షేక్ మస్తాన్‌బీ, షేక్ కాశిం, షేక్ పీరయ్య, షేక్ మస్తాన్, షేక్ మస్తాన్‌వలీ, షేక్ సుభాని పాల్గొన్నారు.



కొప్పోలులో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నేతలు

యూనిట్‌కు రూ.రెండు తగ్గించాలి

చీమకుర్తి: గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లకు విద్యుత్ ఛార్జీలకు సంబంధించి యూనిట్‌కు రెండు రూపాయలు తగ్గిస్తామన్న హామీ ఇచ్చారని, దానిని అమలు చేయలేదని యూనిట్ల యజమానులు సిపిఎం నేతల దృష్టికి తెచ్చారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం బృందం ఆదివారం సాయంత్రం స్థానిక గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లను సందర్శించింది. యూనిట్ యజమానులతో, కార్మికులతో కలిసి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్మికులు మాట్లాడుతూ చీమకుర్తి ప్రాంతంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, వలస కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్.కె మాబు మాట్లాడుతూ గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల రంగంలోకి కార్పొరేట్ కంపెనీలు రానీయకుండా నివారించాలని, పాలిషింగ్ యూనిట్లకు యూనిట్‌కు రెండు రూపాయల తగ్గిస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు, మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, మండల నాయకులు టి రామారావు, క్రిష్టిపాటి చిన్నపరెడ్డి, బి.ఓబులేసు, ఎం లక్ష్మీనారాయణ, జి శంకర్, కే శంకర్, ఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

కొప్పోలు చెరువును సమ్మర్ స్టోరేజ్‌గా మార్చాలి..

ఒంగోలు సిటీ: కొప్పోలు మంచినీటి చెరువును సమ్మర్ స్టోరేజ్ గా మార్చాలని, వేసవి కాలంలో నీటిని ఎద్దడిని తట్టుకునేందుకు ఉపకరిస్తుందని పలువురు విజ్ఞప్తి చేశారు. కొప్పోలు ప్రాంతం లో నెలకొన్న డ్రైనేజ్, రహదారులు వంటి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం నాడు సిపిఎం ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో పదో డివిజన్ కొప్పోలులో పర్యటించింది. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటికి ఎద్దడిగా ఉంటుందని, మంచినీటి సమస్య పరిష్కారానికి స్థానికంగా ఉన్న చెరువుని మంచినీటి సమ్మర్ స్టోరేజ్‌గా మార్చి నీటి ఎద్దడి నుంచి కాపాడాలని కోరారు. త్రోవగుంట పరిధిలో ఎస్సీ కాలనీలలో సైడ్ కాల్వలు, సిమెంట్ రోడ్లు తక్షణమే నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యలతో పాటు తాగునీటి సమస్యలు పరిష్కరించాలని ఆయా ప్రాంతవాసులు సూచించారు. సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ తాగునీటి సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యాత్రలో కార్యదర్శివర్గ సభ్యులు జీ రమేష్, తంబి శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు ఎస్ డి హుస్సేన్, టి మహేష్, ధారా వెంకటేశ్వర్లు, నాయకులు కె శ్యాము, రవి, సిహెచ్.ఆంజనేయులు, హనుమంతరావు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.



పాలిషింగ్ యూనిట్లలో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నేతలు

పొట్టి శ్రీరాములును

స్ఫూర్తిగా తీసుకోవాలి..

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రాణ త్యాగంతో తెలుగు జాతికి గుర్తింపు తెచ్చిన అమరజీవి పొట్టి శ్రీరాములను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం స్థానిక పొట్టి శ్రీరాములు ఏరియా వైద్యశాల ఆవరణలో ఆదివారం జరిగింది. పొట్టి శ్రీరాములు విగ్రహానికి జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, అధికారులు, పుర ప్రముఖులు పుష్పమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు.అహింసా పద్ధతిలో ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన మహనీయులు పొట్టి శ్రీరాములని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఆంధ్ర రాష్ట్ర సాధకుడిగా పొట్టి శ్రీరాములు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. తమిళనాడులో మిళితమైన తెలుగు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను గుర్తించడమే గాకుండా, విశేషంగా పోరాడిన గొప్ప యోధుడన్నారు. తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కావాలని 50 రోజులకు పైగానే ఆమరణ నిరాహార దీక్ష చేసిన గొప్ప వ్యక్తిగా అభివర్ణించారు. భాష ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడటానికి ఆద్యుడు పొట్టి శ్రీరాములేనని సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు రాష్ట్రం నిర్మాణంలో పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగాలను ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలన్నారు. ఆయన పోరాటంతోనే ఏపీ ఏర్పడిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారిని శివలీల, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, డీఈఓ పురుషోత్తం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ విజయమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

ఉద్యోగులకు భరోసా 'పోస్టల్ జీవిత బీమా'

- గ్రాడ్యుయేట్లకు పిఎల్ఐ సదుపాయం
- సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ మహమ్మద్ జాఫర్ సాదిక్



ముఖాముఖి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ సదుపాయం లేని ప్రభుత్వ రంగ ఉద్యోగులకు, ప్రభుత్వ రంగంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పోస్టల్ జీవిత బీమా పథకం (పిఎల్ఐ) భరోసా కల్పిస్తుందని ప్రకాశం జిల్లా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ మహమ్మద్ జాఫర్ సాదిక్ అన్నారు. 30-35 ఏళ్ల పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు ప్రయోజనకరంగా పిఎల్ఐ దోహదపడుతుందన్నారు. ఈ క్రమంలో వారి భవిష్యత్తు దష్ట్యా ముందు జాగ్రత్తగా బ్యాంకులు, ప్రైవేట్ రంగాల్లో పెట్టుబడులు పెట్టడం ఆ సొమ్ముతో, ఇల్లు పెళ్లిళ్ల వంటి అవసరాలు తీర్చుకోవటం పరిపాటిగా మారిందన్నారు. అయితే అటువంటి అవసరాలను తీర్చేందుకు పోస్టల్ శాఖ ముందుందని చెబుతున్న ఆయనతో 'ప్రజాశక్తి' ముఖాముఖి..

పిఎల్ఐకు 141 ఏళ్ల చరిత్ర..

నిజానికి 141 ఏళ్ల క్రితం తపాలా శాఖ ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఓ సంక్షేమ పథకంగా మొదలైన పీఎల్ఐ పథకం ఆ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకు, భద్రతా సిబ్బందికి, సర్కారీ సంస్థల్లో కొలువులు చేస్తున్నవారికి వర్తింపజేశారు. కాలక్రమేణా వైద్యులు, ఇంజినీర్లు, న్యాయవాదులు, సీఏ వంటి ప్రొఫెషనల్స్‌తో పాటు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో నమోదైన కంపెనీల ఉద్యోగులకూ అవకాశం ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల గ్రాడ్యుయేట్లకు పిఎల్ఐ సదుపాయాన్ని వర్తింపజేస్తూ పోస్టల్ శాఖ చర్యలు చేపట్టింది. పిఎల్ఐ ఇతర బీమా సంస్థల కంటే అదనపు ప్రయోజనాలు కలిగించేదిగా రూపొందించడం విశేషం.

పిఎల్ఐ స్కీమ్‌లివీ..

హోల్ లైఫ్ అస్యూరెన్స్ (సురక్ష), యాంటిసిపేటెడ్ ఎండోమెంట్ అస్యూరెన్స్ (సుమంగళ్), కన్వర్టబుల్ హోల్ లైఫ్ అస్యూరెన్సు (సువిధ), ఎండోమెంట్స్ ఎండోమెంట్ అస్యూరెన్స్ (సంతోష్), జాయింట్ లైఫ్ అష్యురెన్స్ (యుగల్ సురక్ష), చిల్డ్రన్ పాలసీ (బాల్ జీవన్ భీమా) వంటి స్కీములు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. వీటిలో కుటుంబం మొత్తానికి ఉపయోగపడే స్కీములు కూడా ఉన్నట్లు తెలిపారు.

చిన్న వయసులో భీమా భవిష్యత్తుకు ధీమా...

ఎంత చిన్న వయసులో భీమా తీసుకుంటే అంత తక్కువ ప్రీమియంతో పాటు ఎక్కువ ప్రయోజనాలు పొందువచ్చని జాఫర్ సాదిక్ తెలిపారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పొందవలసిన గ్రాడ్యుయేట్లు వారు తమ పదో తరగతి డిగ్రీ సర్టిఫికెట్లు అందించాలని పేర్కొన్నారు. ఎంచుకున్న పాలసీని బట్టి వైద్య పరీక్షలు పొందవలసి ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని గ్రామీణ పోస్టల్ ఇన్సూరెన్స్ సదుపాయం ఉన్నట్లు తెలిపారు. వివరాలకు దగ్గరలోని పోస్ట్ ఆఫీస్ లో సంప్రదించాలని సూచించారు.